సాక్షి
అనంతపురం

సోమవారం : 3 : ఫిబ్రవరి : 2025



టమాట కిలో రూ.20
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఊరు.. తేనెలూరు
తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి హనీవిలేజ్‌గా పేరుగాంచింది. గ్రామస్తులు తేనె అమ్ముతూ వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.8°/14.1°
జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

‘పురం’లో చింతపండు క్రయవిక్రయాలు ప్రారంభం



క్రయవిక్రయాల సందర్భంగా చింత పండుకు పూజలు చేసిన దృశ్యం

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం చింతపండు క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. ఫ్లవర్ రకం క్వింటాలు రూ.6 వేలు, కరిపులి రకం రూ.14 వేలు పలికాయి. మార్కెట్ యార్డు ఇన్‌చార్జ్ కిషోర్, వ్యాపార సంఘం అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి దీపక్, ట్రెజరర్ శేషు, వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి వ్యాపారులు పాల్గొన్నారు.

ఫీజు పోరు ర్యాలీకి జీపీఎస్ మద్దతు

అనంతపురం టవర్‌క్లాక్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం ఈ నెల 5న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ర్యాలీకి గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) మద్దతు తెలిపింది. ఈ మేరకు జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ల రిజర్వేషన్ ఖరారు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల చైర్మన్ల ఎంపికకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారైనట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి. సత్యనారాయణచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం- ఓసీ (జనరల్), గుంతకల్లు- ఎస్టీ (మహిళ), గుత్తి- బీసీ (మహిళ), కళ్యాణదుర్గం- బీసీ(మహిళ), రాయదుర్గం-ఓసీ(జనరల్), శింగనమల-బీసీ (మహిళ), తాడిపత్రి-ఎస్సీ(మహిళ), ఉరవకొండ-ఓసీ (జనరల్), రాప్తాడు- ఓసీ (జనరల్)గా ఖరారు చేసినట్లు వెల్లడించారు.

టీడీపీ నేతపై పోక్సో కేసు నమోదు


కణేకల్లు: బాలికను వేధింపులకు గురి చేసిన అంశానికి సంబంధించి టీడీపీ నేతపై చర్యలు తీసుకోవడంలో మీనమేసాలు లెక్కించిన పోలీసులు ఎట్టకేలకు శనివారం రాత్రి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు... కణేకల్లు మండలంలోని ఓ గ్రామానికి చెందిన నిరుపేద బాలికను టీడీపీ నేత ముక్కన్న లైంగికంగా వేధించిన విషయం తెలిసిందే. వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో మూడు రోజుల క్రితం బాలిక ఆత్మహత్యాయత్నం చేయబోయింది. సకాలంలో గుర్తించిన గ్రామస్తులు, తల్లిదండ్రులు వెంటనే బాలికను కాపాడి, విషయం తెలుసుకున్నారు. అనంతరం స్థానికులంతా ఏకమై టీడీపీ నేత ముక్కనను గ్రామంలో కట్టేసి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ముక్కనను విడిపించారు. అనంతరం ఘటనపై బాలిక తల్లి నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదులో జాప్యం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే విషయం కాస్త పత్రికల ద్వారా బహిర్గతం కావడంతో నిందితుడిపై ఎట్టకేలకు శనివారం రాత్రి బీఎన్ఎస్ 75/1, పోక్సో యాక్ట్ 11, 12 కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు



పెద్దవడుగూరు: మండలంలోని వీరేపల్లి వద్ద 63వ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొంది. గుత్తి డిపోకు చెందిన ఏపీ02టీసీ 6706 బస్సు తాడిపత్రి నుంచి ప్రయాణికులతో వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. క్లచ్ ప్లేట్లు పని చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ప్రమాదంలో గాయపడిన కండక్టర్ రమేష్‌తో పాటు ప్రయాణిస్తున్న ఓ చిన్నారిని తక్షణమే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురక్షితంగా బయటపడిన ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానానికి చేర్చారు.

కాసుల సర్వే



పామిడి మండలంలోని ఒక గ్రామంలో కానిస్టేబుల్ కుటుంబానికి రెండెకరాల పొలం ఉంది. దీన్ని సర్వే చేసేందుకు ఇటీవల కానిస్టేబుల్ గ్రామ సర్వేయర్ వద్దకు వెళ్లగా.. ఆయన రూ.10 వేలు వసూలు చేశాడు. పొలం పక్కనే తమకు 26 సెంట్ల స్థలం ఉందని, దాన్ని కూడా సర్వే చేయాలని కోరగా, సదరు సర్వేయర్ స్పందించలేదు. దీంతో కానిస్టేబుల్ ఆ శాఖ అధికారి ద్వారా సర్వేయర్‌కు ఫోన్ చేయించగా పొలం వద్దకు వచ్చి మళ్లీ రూ. 3 వేలు లాగి సర్వే చేశాడు. ఇదొక్కటే కాదు.. జిల్లావ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి.



సర్వే, భూ రికార్డుల శాఖ కార్యాలయం

- గ్రామ సర్వేయర్ల వసూళ్ల దందా
- ఉన్నతాధికారులు చెప్పినా లెక్కచేయని వైనం
- ముడుపులివ్వకపోతే తప్పని తిప్పలు

అనంతపురం అర్బన్: సర్వే, భూ రికార్డుల శాఖకు చెందిన సర్వేయర్లు వసూల్ రాజాలుగా మారారు. లంచాలు పుచ్చుకోవడంలో మండల సర్వేయర్లను గ్రామ సర్వేయర్లు మించిపోయారు. కొందరు గ్రామ సర్వేయర్లు ముక్కుపిండి డబ్బులు దండుకుంటున్నారు. కొలతలు వేయాలంటే.. చేతిలో కాసులు పడాల్సిందే. లేదంటే భూ యజమానికి చుక్కలు చూపిస్తూ ముప్పు తిప్పలు పెడుతున్నారు.

మాది మాకు ఇవ్వాల్సిందే..

సర్వే చేయాలని స్వయంగా శాఖ ఉన్నతాధికారులు ఫోన్ చేసి చెప్పినా... ‘మాది మాకు ఇవ్వాల్సిందే’ అంటూ వసూలు చేస్తున్నారు. ‘‘మేము ఎవరి మాట వినం, ఈ విషయంలో తగ్గేదేలే’’ అనే రీతిలో రెచ్చిపోతున్నారు. గతంలో మండల సర్వేయర్లదే పెత్తనం ఉండేది. గ్రామ సర్వేయర్ల వ్యవస్థ రావడంతో వారి ప్రభ తగ్గింది. గ్రామంలో భూమి లేదా స్థలం సర్వే చేయాలన్నా వీరిని సంప్రదించాల్సి వస్తోంది. ఇదే అదునుగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

కాసుల పంట..

భూముల సర్వే సర్వేయర్లకు కాసుల పంట కురిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వే కోసం ‘మీ సేవ’లో చలానా కట్టి దరఖాస్తు చేసుకుంటే 45 రోజుల్లోపు సమస్య పరిష్కరించాలి. అయితే సర్వేయర్లు నిర్ణీత వ్యవధిలో సర్వే చేయకుండా ప్రజలను తిప్పుకోవడం... చేతులు తడిపిన తరువాత సర్వే చేయడం సర్వసాధారణంగా మారింది. వివాదాస్పద స్థలాల సర్వే చేయాల్సి వస్తే వీరి దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఇలాంటి వ్యవహారాల్లో అవకాశం దొరికితే దరఖాస్తుదారుడిని పిండేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. డిమాండ్ చేసినంత మొత్తం ఇవ్వకపోతే అతని ప్రత్యర్థితో లాలూచీ పడి అర్జీదారునికి నష్టం కలిగేలా రిపోర్ట్ ఇస్తున్నారనే విమర్శలున్నాయి.

మారని తీరు..

గతంలో చాలా మంది సర్వేయర్లు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు ఓ రైతు పొలం సర్వే చేసేందుకు రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. ఓ రైతుకు చెందిన 7.5 ఎకరాల భూమి సర్వే చేసేందుకు ధర్మవరం మండల సర్వేయర్ చంద్రాయుడు రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతపురం నగర పాలక సంస్థకు ఫారిన్ సర్వీసెస్ కింద వెళ్లిన సర్వేయర్ కోటేశ్వరరావు ఓ స్థలాన్ని సర్వే చేసిన తరువాత అందుకు సంబంధించిన రిపోర్ట్ ఇచ్చేందుకు వ్యక్తి నుంచి ఏకంగా రూ.7 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తూ ఇలా ఎంతో మంది వలలో చిక్కుకున్నా ఇప్పటికీ కొందరి తీరు మారకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదు చేయండి



భూములు, స్థలాలు సర్వే చేసేందుకు, సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు ఎవరైనా సర్వేయర్లు డబ్బులు డిమాండ్ చేస్తే బాధితులు నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు. అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం.
– రూప్లానాయక్, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే, భూరికార్డుల శాఖ

నేడు తాడిపత్రికి పెద్దారెడ్డి

- అలజడులు సృష్టించేందుకు జేసీ ప్రణాళిక!

సాక్షి టాస్క్‌ఫోర్స్: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం తన స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి రానున్నారు. ఈ క్రమంలో పట్టణంలో అలజడులు సృష్టించేందుకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రణాళికలు రచించినట్లు తెలిసింది. పట్టణానికి రావాలంటూ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులకు వాట్సాప్ మెసేజ్‌లు పంపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరాచకాలకు తెరలేపారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి రాకుండా అధికార అండతో అడ్డుకుంటున్నారు. అయితే,చాలా రోజుల తర్వాత ప్రజలను కలుసుకునేందుకు పెద్దారెడ్డి వస్తున్నా.. అలజడులు సృష్టించేందుకు జేసీ ప్రభాకర్ రెడ్డి సిద్ధం కావడంపై పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.హనుమంతు తెలిపారు. అనంతపురంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలపై చర్చించారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సహాధ్యక్షుడిగా సాకే రామాంజనేయులు(నవోదయ కాలనీ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివ శంకరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.సిద్దేశ్వర్, వి.హనుమంతరెడ్డి, డి.నూర్‌బాషా, ఎ.బాలకృష్ణారెడ్డి, కె.జైనాబీ, ఎం.గణేష్, ఎస్.రాఘవేంద్ర ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా డి.నరసింహులు, ట్రెజరర్‌గా ఆర్.మహేష్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.భగీరథరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.దాదా ఖలందర్, కె.స్వాతి, ఎస్.రజిని, పీహెచ్ మంజునాథ, పి.ఆదినారాయణ,ఎ.జ్యోతి స్వరూప్, సీకే నరేష్, కార్యవర్గ సభ్యులుగా జి.అశోక్ రాజు, బి.మణిదీప్, డి.అహమ్మద్‌ను ఎన్నుకున్నారు.

యువజన విభాగం సైన్యంలా పని చేయాలి

- కేసులు, బెదిరింపులకు భయపడొద్దు
- ఎవరికి ఇబ్బంది వచ్చినా పార్టీ తోడుగా ఉంటుంది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, యువజన విభాగం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: ‘గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత ఎంతో కీలకంగా పనిచేశారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో యువజన విభాగం సైన్యంలా పని చేయాలి’ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని కనకదాస కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోను చిత్తశుద్ధితో అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలవుతున్నా..ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అధికార పార్టీ నేతల బెదిరింపులు, అక్రమ కేసులపై కలసికట్టుగా పోరాటం చేద్దామన్నారు. ఎవరికి ఇబ్బంది వచ్చినా పార్టీ ముందుంటుందని తెలియజేశారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అధికారంలో ఉన్నా..ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై ఇప్పటికే పెద్ద ఎత్తున ఆందోళనలు చేశామని, ఎవరూ ఊహించని విధంగా స్పందన వచ్చిందన్నారు. ఈ నెల 5న విద్యార్థుల సమస్యలపై నిర్వహించే ‘ఫీజు పోరు’కు పెద్ద ఎత్తున యువత తరలిరావాలన్నారు. యువజన విభాగం నాయకులు కళాశాలలకు వెళ్లి కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు పడుతున్న కష్టాలను తెలియజేయాలన్నారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట పడదామన్నారు. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో యువజన కమిటీలు ఏర్పాటవుతాయన్నారు. కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానాలను ఎక్కడికక్కడ ప్రజలకు గుర్తు చేస్తూ ఆందోళన చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యువజన విభాగం అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులు శ్రీనివాస్ దత్తా, అబ్దుల్ బషీద్, తలారి చరణ్, రవి, యువజన విభాగం నాయకులు సురేష్, లోక్‌నాథ్‌రెడ్డి, నరేంద్ర, బుల్లె జగదీష్, వినీత్, మణికంఠ, కిరణ్, చంద్రశేఖర్, బిల్లే నాగార్జున, సాకే కుమార్, మైను, తదితరులు పాల్గొన్నారు.

‘రాయదుర్గం-తుమకూరు’కు నిధులు

- వేగం పుంజుకోనున్న రైల్వే లైన్ పనులు



రాయదుర్గం-తుమకూరు రైలు మార్గంలో జరుగుతున్న పనులు

రాయదుర్గంటౌన్: కేంద్ర రైల్వే బడ్జెట్‌లో రాయదుర్గం- తుమకూరు రైలు మార్గం నిర్మాణానికి రూ.434.85 కోట్ల నిధులు కేటాయించారు. 206.53 కిలోమీటర్ల మేర తుమకూరు-రాయదుర్గం బ్రాడ్‌గేజ్ రైల్వే లైను పనులు జరుగుతున్నాయి. 2012లో రూ.1,714.50 కోట్ల అంచనాతో పనులు ప్రారంభమయ్యాయి. 94 కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్, 113 కిలోమీటర్లు కర్ణాటక పరిధిలో రైలుమార్గం వెళ్తుంది. ప్రాజెక్ట్ ఖర్చును రైల్వేశాఖ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 లెక్కన భరించాల్సి ఉంది. ఇప్పటివరకూ బడ్జెట్‌లో ప్రతి సారీ తక్కువ నిధులు కేటాయిస్తున్న క్రమంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు 14 సంవత్సరాలుగా నిర్మాణ పనులు జరుగుతుండడం గమనార్హం. పనుల్లో అంతులేని జాప్యం కారణంగా ప్రస్తుతం నిర్మాణ అంచనా వ్యయం రూ.2,450 కోట్లకు చేరుకుంది. 2016లో కళ్యాణదుర్గం వరకు, 2017లో కదిరిదేవరపల్లి వరకు రైలు మార్గం పూర్తయింది. దీంతో తిరుపతి–కదిరిదేవరపల్లి రైలు సర్వీసును ప్రారంభించారు. ప్రస్తుతం దొడ్డహళ్లి నుంచి కర్ణాటకలోని పావగడ సమీపంలోని కె.రాంపుర వరకు 103 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో 104 కిలోమీటర్ల మేర కె.రాంపుర నుంచి పావగడ, మడకశిర, మధుగిరి, కొరటగెరె, ఉరుకెరె, తుమకూరు వరకు రైల్వే పనులు వేగవంతం కావడం లేదు. కొట్టాళం, మడకశిర వరకు రైల్వే లైను పనులు పూర్తయితే ఆంధ్రా సెక్షన్ పూర్తవుతుంది. కర్ణాటకలో కూడా అవసరమైన చోట్ల భూ సేకరణ, బ్రిడ్జిల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రైలు మార్గం నిర్మాణానికి రూ.434.85 కోట్లు కేటాయించడంతో పనులు వేగం పుంజుకునే అవకాశం ఉంది.

‘ఆమె’ తలచుకుంటే అంతే..

- ఐసీడీఎస్‌లో ఆరితేరిన ఓ సీడీపీఓ
- ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టులకే ఎసరు
- నాడు సుశీలాదేవి.. నేడు వనజా అక్కమ్మ బలి



అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్)లో ‘ఆమె’ మాట శాసనంగా మారుతోంది. పార్టీలతో సంబంధం లేకుండా రాజకీయం నెరపడంలో ఆమె అందెవేసిన చేయిగా పేరుగాంచారు. ఆమె చేతిలో ఏకంగా ప్రాజెక్టు డైరెక్టర్‌లే బలి అవుతున్నారు. గతంలో విశాఖపట్నం జిల్లా నుంచి వచ్చిన సుశీలదేవిని, తాజాగా జిల్లాలో సుదీర్ఘకాలంగా ఐసీడీఎస్‌లో సేవలందిస్తున్న వనజాఅక్కమ్మను నెలలు తిరక్కనే తిరుగుముఖం పట్టించారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ‘ఎప్పుడొచ్చామా అన్నది కాదు.. బుల్లెట్టు దిగిందా లేదా’ అన్న తరహాలో ఐసీడీఎస్‌లో ఆమె వ్యవహారశైలి నడుస్తోందనే విమర్శలున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్ సీడీపీఓలకు అడహక్ పదోన్నతులు కల్పించారు. అందులో భాగంగా కంబదూరు సీడీపీఓగా పనిచేస్తున్న వనజాఅక్కమ్మకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. వనజాఅక్కమ్మకు ముందునుంచి జిల్లాపై అవగాహన ఉండటంతో ఎక్కడా ఇబ్బందులు రాకుండా విధులు నిర్వర్తించారు.

రాష్ట్ర స్థాయిలో మంత్రాంగం..

అయితే, అప్పనంగా అధికారాలు అనుభవించడం అలవాటుగా మారిన ఓ సీడీపీఓకు వనజాఅక్కమ్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేయడం ఏమాత్రం రుచించలేదు. అందులో భాగంగా రాష్ట్ర డైరెక్టర్ స్థాయి అధికారిపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తీసుకొచ్చారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు రాకపోయినప్పటికీ వనజాఅక్కమ్మ పదోన్నతిపై పలు ఫిర్యాదులు చేయించడంలో సక్సెస్ అయ్యారు. గతంలో విశాఖపట్నం జిల్లా నుంచి పదోన్నతిపై జిల్లాకు వచ్చిన సుశీలాదేవిపై కూడా ఫిర్యాదులు చేయించి.. నెలలు తిరక్కనే ఆమెపై బదిలీ వేటు వేయించారనే ఆరోపణలున్నాయి. తాజాగా వనజా అక్కమ్మను ఉన్నఫళంగా మహిళా ప్రాంగణం మేనేజర్‌గా బదిలీ చేయడం వెనుక ఆమె హస్తం ఉందని తెలిసింది.

ఎమ్మెల్యేలకు తాయిలాలు..

ఉన్నత సీట్లో కూర్చునేందుకు సదరు సీడీపీఓ జిల్లాలోని ఒకరిద్దరు ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకున్నట్లు సమాచారం. ‘అంతా మీరు చెప్పినట్లు నడిపిస్తా’ అంటూ నమ్మబలికినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధులనే కాదు ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులను కూడా తనకు అనుకూలంగా మలుచుకుంటారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తిట్లు తిన్నా.. అవార్డు

బాలలకు పౌష్టికాహారం అందడం లేదని, వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేకున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సదరు సీడీపీఓను ఇటీవల రాష్ట్ర స్థాయి డైరెక్టరేట్ అధికారులు తీవ్రస్థాయిలో మందలించారు. అయినా, ఆ మరుసటి రోజే ఆమె ‘ఉత్తమ’ పురస్కారానికి ఎంపిక కావడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే ఆమె ఏ స్థాయిలో మంత్రాంగం నడుపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇక.. సదరు సీడీపీఓ పనిచేసిన చోటల్లా అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు తరలించకుండానే దారి మళ్లించారనే అభియోగాలు ఎదుర్కొన్నారు. అంతకుముందు ఐసీడీఎస్‌లో జరిగిన ఔట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ ఉద్యోగుల నియామకాలను నిశితంగా పరిశీలిస్తే ఆమె అక్రమాలు వెలుగుచూసే అవకాశముంది. ఏదిఏమైనా ‘ఆమె’ తీరుతో జిల్లాలో ఐసీడీఎస్ వ్యవహారాలే అస్తవ్యస్తంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు


కుక్కలను తరిమికొడుతున్న గ్రామస్తులు

రాయదుర్గం టౌన్: మండలం మల్లాపురం గ్రామ బీసీ కాలనీలో వీధి కుక్కలు దాడి చేయడంతో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులు స్నేహ, లతపై రెండు కుక్కలు దాడి చేశాయి. స్థానికులు వెంటనే కుక్కలను తరిమి కొట్టారు. గాయపడిన చిన్నారులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. కాగా, అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

కొండపై వృద్ధుడి మృతి


కొండపై నుంచి మృతదేహాన్ని తీసుకువస్తున్న పోలీసులు, 108 సిబ్బంది

శింగనమల: కొండపైకి ఎక్కుతూ ఓ వృద్ధుడు గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలు... మాఘమాసాన్ని పురస్కరించుకుని అనంతపురానికి చెందిన గొంది ప్రకాష్(67), తన భార్య రామసుందరి, తమ్ముడి కుమారుడు గొంది సుబ్రహ్మణ్యంతో కలసి ఆదివారం సాయంత్రం 4 గంటలకు శింగనమల సమీపంలోని రుష్యశృంగుని కొండపై ఉన్న ఆలయంలో పూజకని వచ్చారు. కొండపైకి దాదాపు 2 కిలోమీటర్ల ఎక్కిన తర్వాత గొంది ప్రకాష్ గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో విషయం తెలుసుకున్న కానిస్టేబుళ్లు నరేష్‌కుమార్, రామాంజనేయులు, 108 సిబ్బంది కేశవ, సాకే శివ వెంటనే అక్కడకు చేరుకున్నారు. అంబులెన్స్‌ను కొండ దిగువన పైకి వెళ్లి పరీక్షించే లోపు గొంది ప్రకాష్ మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని కిందకు దించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆంధ్ర వెటరన్స్ ఘన విజయం

అనంతపురం: పీవీకేకే ప్రసాద్ స్మారక సౌత్ జోన్ వెటరన్స్ క్రికెట్ టోర్నీ విజేతగా ఆంధ్ర వెటరన్స్ జట్టు నిలిచింది. ఆంధ్ర, తమిళనాడు జట్ల మధ్య ఆదివారం ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి తమిళనాడు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో ఆంధ్ర జట్టు 8 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. ఏజీ ప్రవీణ్ 38 పరుగులు, జి.ఎలజెర్ 32 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తమిళనాడు జట్టు 19.3 ఓవర్లలో 106 పరుగుల వద్ద చతికిలబడింది. ఆంధ్రా బౌలర్లు ఎస్ఎస్ భరత్ కుమార్ 5 వికెట్లు తీసి తమిళనాడును కోలుకోలేని దెబ్బ తీశాడు. 82 పరుగుల తేడాతో ఆంధ్ర వెటరన్స్ జట్టు విజయం సాధించింది.


చిల్లకొండయ్యపల్లి సమీపంలో విస్తరించిన అటవీ ప్రాంతం

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఇది కూడా అలాంటి ఊరే. ఈ ఊరు పేరు చెబితే చాలు నోరూరుతుంది. తియ్యని పిలుపు రారమ్మంటుంది. అదే తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయంతో నష్టపోయిన రైతులు.. ఉపాధి కోసం అడవి బాట పట్టారు. కొండ, గుట్టలెక్కుతూ తేనె సేకరించి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ఊరు.. తేనెలూరు

- రారమ్మంటున్న 'హనీ విలేజ్'
- స్వచ్ఛమైన తేనెకు చిరునామా చిల్లకొండయ్యపల్లి
- కొండ, గుట్టల్లో తేనె సేకరిస్తున్న గ్రామస్తులు
- 25 కుటుంబాలకు ఉపాధి

SOMETHING SPECIAL


తేనె తెట్టె నుంచి తేనెటీగలను లేపిన దృశ్యం


తాడిమర్రి: ఉదయమే సద్దిమూట కట్టుకుని అందరూ పొలం బాట పడితే తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి యువకులు మాత్రం అడవిబాట పడతారు. కొండ, గుట్ట, చెట్టు, చేమ ఇలా చుట్టేస్తూ సేకరించిన స్వచ్ఛమైన తేనెను విక్రయించి కుటుంబాలను పోషించుకుంటున్నారు. గ్రామంలోని 25 కుటుంబాలు తేనె సేకరణను ఉపాధిగా మలచుకున్నాయి.

15 ఏళ్లుగా... తేనె సేకరణే వృత్తిగా

దాదాపు 15 సంవత్సరాలుగా తేనె సేకరణనే వృత్తిగా పెట్టుకుని చిల్లకొండయ్యపల్లి యువత జీవనం సాగిస్తోంది. అప్పట్లో వ్యవసాయ పనులు లేక పోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు కాటమయ్య అనే వ్యక్తి తొలిసారిగా తేనె సేకరణను ఉపాధిగా మార్చుకున్నాడు. అనంతరం అదే బాటలో కొందరు యువకులు పయనించారు. అయితే వీరు సేకరించిన తేనెకు సరైన మార్కెటింగ్ లేక ఇబ్బంది పడుతుండడంతో అప్పట్లో మహాత్మాగాంధీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా ఉన్న రామలింగప్ప స్పందించి, గిట్టుబాటు ధరతో తేనె కొనుగోలు చేసేలా చెన్నకొత్తపల్లిలోని ధరణి స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదిర్చాడు. ప్రస్తుతం సంస్థ కిలో తేనెను రూ.400 చొప్పున కొనుగోలు చేస్తుండగా... స్థానికంగానే ఇతరులకు రూ.500తో విక్రయిస్తూ ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతున్నారు. ఉమ్మడి జిల్లాలో చిల్లకొండయ్యపల్లి తేనెకు మంచి గిరాకీ ఉంది.

అన్నం పెడుతున్న అడవి..

మండలంలోని దాడితోట బీట్ పరిధిలో కునుకుంట్ల, చిల్లవారిపల్లి, దాడితోట గ్రామాలతో పాటు పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామాల పరిధిలో సుమారు 3,534 హెక్టార్లలో రిజర్వు ఫారెస్టు విస్తరించి ఉంది. రిజర్వు ఫారెస్టులో అటవీ అధికారులు నారేపి, ఎర్రచందనం, తపసీ తదితర మొక్కలు భారీగా నాటారు. ఇప్పుడా మొక్కలు పెద్ద వృక్షాలై తేనెపట్టులకు ఆవాసాలుగా మారాయి. ఫలితంగా రిజర్వు ఫారెస్టు ఎందరికో ఉపాధి వనరుగా మారి అన్నం పెడుతోంది.


చిల్లకొండయ్యపల్లి ముఖచిత్రం

ముంగార్ల కాలం అనువైనది..

తేనె సేకరణకు ముంగార్ల కాలం అనువైనది. జూన్ ప్రారంభంతో వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో అడవులు, తోటలు, బీడు భూములు పచ్చదనం సంతరించుని పుష్పాలు వికసిస్తాయి. ఆ పుష్పాల్లోని మకరందం కోసం వచ్చే తేనెటీగలు సమీపంలోనే తేనెపట్టులను ఏర్పాటు చేసుకుంటాయి. ఏడాదిలో సుమారు 9 నెలల పాటు తేనె సేకరణలో ఇక్కడి యువకులు నిమగ్నమవుతారు. నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని చెబుతున్నారు.


తేనెను శుద్ధి చేస్తున్న యువకుడు సూరి

తేనె సేకరణలో కష్టాలు ఎన్నో..

తేనె ఎంత రుచిగా ఉంటుందో దానిని సేకరించడమంటే అంతకు రెట్టింపు కష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. అయినా చిల్లకొండయ్యపల్లి యువకులు కష్టాలను లెక్కచేయడం లేదు. కళ్లముందు తేనె పట్టు కనిపిస్తే చాలు వెంటనే సేకరణలో నిమగ్నమవుతారు. ఈ క్రమంలో ముళ్లకంపలు గుచ్చుకున్నా, తేనెటీగలు కుట్టినా తమ పట్టు మాత్రం వదలరు. ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నా... తేనెటీగలు కుట్టి తీవ్ర అస్వస్థతకు లోనైన సందర్భాలు ఎన్నో ఉన్నాయని యువత తెలుపుతోంది.

రుణాలివ్వాలి



అడవుల్లో తేనె సేకరణ ఏడాది పొడవునా ఉండదు. దీంతో తేనె సేకరించలేని సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. తేనెటీగల పెంపకానికి ప్రభుత్వం రుణాలిస్తే మాకు మేలు జరుగుతుంది. గ్రామంలోనే తేనెటీగల పెంపకంతో ఉపాధి పొందుతాం.

– చిల్లా నాగేష్, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి.

తేనె సేకరణ కష్టమైంది



ప్రస్తుతం తేనె సేకరణ చాలా కష్టంగా మారింది. గతంలో రోజుకు మూడు, నాలుగు కిలోల తేనె సేకరించేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, పంటలపై పురుగు మందుల పిచికారీ ఎక్కువ కావడంతో తేనెటీగల ఉత్పత్తి తక్కువైంది. ప్రభుత్వం స్పందించి తేనెటీగలకు అనుకూల వాతావరణం కల్పిస్తే మాకు మేలు జరుగుతుంది.

– చిల్లా హేమంత్, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

ఉపాధి చూపుతున్నాం



రిజర్వ్ ఫారెస్టు సమీప గ్రామాల్లోని రైతులు, యువతకు అడవి ద్వారా ఉపాధి మార్గం చూపుతున్నాం. పశువుల మేత, తేనె పట్టు కోసం ప్రత్యేకంగా ప్లాంటేషన్ చేపట్టాం. అలాగే చెట్లను కొట్టకుండా పర్యవేక్షించడం, ఎండుగడ్డికి నిప్పు పెట్టకుండా గొర్రెలు, పశువుల కాపర్లకు అవగాహన కల్పిస్తున్నాం. అడవుల్లోకి వచ్చే రైతులు, యువకులు, మహిళలకు ఇబ్బందులు కలిగించకుండా బీట్ ఆఫీసర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం.

– ఎస్.యామినీ సరస్వతి, ఎఫ్ఆర్ఓ, బుక్కపట్నం

పెద్దిరెడ్డి కుటుంబంపై ప్రభుత్వ కుట్ర

- డైవర్షన్ పాలిటిక్స్‌లో చంద్రబాబు దిట్ట
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ప్రజాదరణను ఓర్వలేక కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. పెద్దిరెడ్డి కుటుంబానికి భూముల కబ్జాలు, అక్రమాలకు పాల్పడాల్సిన అవసరం లేదన్నారు. వారి కుటుంబం నిత్యం ప్రజా సేవ చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ ఎదుగుదల, ప్రజల్లో వారికి ఉన్న ప్రేమ, ఆప్యాయతలు చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వం, పచ్చ మీడియా అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు పథకం ప్రకారమే పెద్దిరెడ్డిపై గోబెల్స్ ప్రచారానికి తెరతీశారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయక వైఫల్యం చెందడంతో ప్రజల దృష్టిని మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం కొనుగోలు చేసింది అటవీ భూమి కాదని కేంద్రం గెజిట్‌లో కూడా స్పష్టంగా చెప్పిందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు అండ్ కో ఇచ్చిన హామీలు అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హితవు పలికారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే బడ్జెట్..

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని విశ్వ తెలిపారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే బడ్జెట్ సారాంశంగా ఉందని విమర్శించారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవన్నారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం అంటూ అంకెల గారడీ చేశారన్నారు. రాష్ట్రానికి నిధులు సాధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు ఘోరంగా విఫలమయ్యారని తెలిపారు.

భవిష్యత్తుకు భరోసా ఏదీ బాబూ?

- ఫీజు పోరును జయప్రదం చేద్దాం
- బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం
- రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికలకు ముందు ఇబ్బడి ముబ్బడిగా హామీలు గుప్పించి ప్రజల భవిష్యత్తుకు తనది గ్యారెంటీ అంటూ గొప్పలకు పోయిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పాటు చేసి 8 నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లేకుండా చేశారని రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 5న జిల్లా కేంద్రంలో జరిగే ఫీజు పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్రం విడుదల చేసిన బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు చెప్పిన బుల్లెట్ రైలుకు, గోదావరి పరకచెర్ల లిఫ్ట్ ఇరిగేషన్, రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు ఎటువంటి కేటాయింపులు జరగలేదన్నారు. 16 మంది ఎంపీలున్న టీడీపీ కన్నా..12 మంది ఎంపీలున్న జేడీయూ తన రాష్ట్రానికి (బిహార్)కు నిధులు రాబట్టుకోవడంలో సఫలమైందన్నారు.

పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు 45.72 మీటర్లు కాగా, 41.1 మీటర్లకే పరిమితం చేశారని, పనులకు రూ.5,936 కోట్లు కేటాయిస్తున్నామని కేంద్రం బడ్జెట్‌లో స్పష్టం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు 45.72 మీటర్లకు చేస్తే 600 గ్రామాలకు తాగునీరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాకారమవుతుందన్నారు. అలాగే కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు,. 960 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి, విశాఖ నగరానికి తాగునీరు కూడా ఇవ్వొచ్చునన్నారు. రాయలసీమకు 80 టీఎంసీల నీటిని మళ్లిస్తామంటూ చంద్రబాబు చెప్పినవన్నీ కట్టుకథలేనని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత లక్షలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. నీతి అయోగ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చంద్రబాబు మాట్లాడిన తీరు చూస్తే తాము సంపదను సృష్టించిన తర్వాతనే సూపర్ సిక్స్ ఇస్తామని ప్రజలను దగా చేసే కుట్రకు తెరలేపారనేది స్పష్టమవుతోందన్నారు. ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర అప్పులు రూ.6 లక్షల కోట్లు అని ప్రకటించి... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లు అని ఎల్లోమీడియా, పురంధరేశ్వరితో చంద్రబాబు చెప్పించి తన నైజాన్ని బయటపెట్టుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వివిధ పథకాలతో ప్రజలకు మేలు చేశాన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలంటే బడ్జెట్‌లో రూ.1.50 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉందని, ఆ దిశగా ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌కే లింగారెడ్డి, చిరంజీవి, మీనుగ నాగరాజు, నీరుగంటి నారాయణ రెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఈశ్వరయ్య, నిఖిల్‌యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, మన్‌ప్రీత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్‌పై నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తి ప్రజావ్యతిరేకంగా ఉందంటూ సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం అనంతపురంలోని టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటనారాయణ, ముత్తూజ, గోపాల్ మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రం గురించి కనీసంగానూ మాట కూడా లేదన్నారు. గతంలో, ఇప్పుడూ బీహార్‌కు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించారన్నారు. రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీకి శాశ్వత మంగళం పాడినట్టైందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేలా పలు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. కొత్తగా ప్రతిపాదించిన బడ్జెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ ధన్ ధాన్య పథకం పేరుతో 100 జిల్లాల్లో కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడమే నిదర్శనమన్నారు. సుదీర్ఘకాలంగా రైతులు పోరాడుతున్న వ్యవసాయ కొత్త చట్టాల రద్దు గురించి, రైతు ఆత్మహత్యల గురించి ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. బీమా రంగంలోనూ వందశాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడంతో ఆ రంగం పూర్తిగా విదేశీ కంపనీల చేతుల్లోకి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ సంస్కరణలు అమలు చేసి అదనపు అప్పులకు అవకాశం ఇస్తామనడం అత్యంత దుర్మార్గమన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు గత ఏడాది రూ.8,622 కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో రూ.3,195 కోట్లు కేటాయించడాన్ని ఏలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. విభజన హామీల్లో భాగంగా కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావన లేదన్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వలి, మసూద్, వెంకటేష్, బుల్లెరాజు, ఓబుళేసు, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను క్రీడా హబ్‌గా మారుస్తాం

- శాప్ చైర్మన్ రవినాయుడు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం: జిల్లాను క్రీడా హబ్‌గా మారుస్తామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. 'వీ వైబ్' సంస్థ ఆధ్వర్యంలో 'సే నో టూ డ్రగ్స్' పేరుతో అనంతపురంలో ఆదివారం చేపట్టిన 10కే రన్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. డ్రగ్స్ నియంత్రణకు క్రీడలు దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అడిషనల్ ఎస్పీ మల్లిఖార్జున వర్మ, వీ వైబ్ సంస్థ ప్రతినిధి రాధా, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ అధికారి ఉదయ్‌భాస్కర్, అర్బన్ టెక్ తేజారెడ్డి, ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ అండ్ మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, రజక ఫెడరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, రాయలసీమ బలిజ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

టెన్‌కే రన్ వరుసగా తొలి మూడు స్థానాలను అబ్బాస్ అలీ (చిత్తూరు), రాథోడ్ అనిల్ (హైదరాబాద్), రమేష్ చంద్ర (హైదరాబాద్) దక్కించుకున్నారు. మహిళా విభాగాల్లో హైదరాబాద్‌కు చెందిన ఉమ, స్వప్న, సమ్రీన్ గెలుపొందారు. ఏజీఎస్ రెడ్డి సోషల్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో విజేతలకు నగదు పురస్కారాలను అందజేశారు.

ఆ పింఛన్లు ఆపేయండి!

- అధికారులకు టీడీపీ మండల కన్వీనర్ హుకుం

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో చర్మ కారుల పింఛన్ల మొత్తాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ పంపిణీ చేయరాదంటూ సచివాలయ సిబ్బందిని టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆదేశించారు. రెండు రోజుల ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అంశానికి సంబంధించి వివరాలు... ఈ నెల పింఛను అందించేందుకు గ్రామానికి వచ్చిన సచివాలయ సిబ్బందిని శ్రీరాములు కలసి ఎవరెవరికి పింఛన్లు వచ్చాయంటూ ఆరా తీశారు. గ్రామానికి చెందిన దళితులు లింగప్ప, ధనుంజయ, శివన్నకు పింఛన్ జారీ అయినట్లు తెలుసుకున్న ఆయన వెంటనే వారికి ఆ మొత్తాన్ని ఇవ్వకూడదంటూ సచివాలయ సిబ్బందికి సూచించారు. తన మాట వినకపోతే ఇబ్బంది పడతారని హెచ్చరించారు. పింఛన్‌దారులు వెళ్లి కలిసేత శ్రీరాములును కలసి మాట్లాడాలని సచివాలయ సిబ్బంది తెలపడంతో లబ్ధిదారులు వెంటనే ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నందకిషోర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే తాను ఎమ్మెల్యే మీటింగ్‌లో ఉన్నానని వచ్చిన తర్వాత మాట్లాడుతానని ఆయన సమాధానమివ్వడంతో బాధితులు వెనుదిరిగారు. కేవలం దురుద్దేశంతోనే తమకు పింఛన్లు అందకుండా చేస్తున్నారని ఈ సందర్భంగా దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం: కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలకు ఈ నెల 5వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. రిజర్వేషన్ మేరకు మద్యం దుకాణాలు కేటాయింపుపై అనుమానాలు నివృత్తి చేయడానికి ఆదివారం తన చాంబర్లో కల్లు గీత కులాల ప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా త్వరగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్


నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఎం చంద్రబాబును ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలంటూ ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీకి సంబంధించి ఇప్పటి వరకూ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. నిరుద్యోగభృతి ఊసే లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ప్రస్తావన కూడా చేయడం లేదన్నారు. నిరుద్యోగులకు 20 లక్షలు ఉద్యోగాలు ఎక్కడ, ఎప్పుడు, ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సమగ్ర యువజన విధానం అమలు చేయాలన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ కింద యువతకు ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించాలన్నారు. వీటన్నిటిపై ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించి పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, శ్రీనివాసులు, మన్సూర్, సాదిక్, వలి, ధనుంజయ, మాబాషా, నబీరసూల్, గణేష్, ముజీర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- 44వ జాతీయ రహదారి సమీపంలోని చింత తోపులో ఘటన
- మృతుడు ధర్మవరం మండలం మల్కాపురం వాసి
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన అనంతపురం రూరల్ డీఎస్పీ


ఎరికల కాశీ మృతదేహం

రాప్తాడు రూరల్: ధర్మవరం రూరల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ ఎరికల కాశీ (40) అనంతపురం నగర శివారులో దారుణ హత్యకు గురయ్యాడు. కక్కలపల్లి సమీపంలోని టమాట మండీలో గుమాస్తాగా పని చేస్తున్న ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సొంతంగా ఓ వాహనాన్ని సైతం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురం నగర శివారులోని 44వ జాతీయ రహదారి సమీపంలో సంగమేశ్వర ఫంక్షన్ హాల్ పక్కన చింతవనంలో హతమై కనిపించాడు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐ శేఖర్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం ఘటన జరిగినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. తలపై బండరాళ్లతో మోది హత్య చేసినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. కాగా, మృతదేహం పరిసర ప్రాంతాల్లో ఖాళీ మందుబాటిళ్లు, వాటర్ బాటిళ్లు, స్నాక్స్ పార్శిల్ తెచ్చుకున్న కాగితాలు పడి ఉండడంతో... కాశీతో పాటు ఇక్కడ డిన్నర్ చేసుకున్నవారే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. రెండు నెలలుగా ఇంటికి సైతం వెళ్లకుండా టమాట మండీలోనే ఉన్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలో కుటుంబంలో ఏవైనా గొడవలున్నాయా? లేదా ఆర్థిక లావాదేవీలా? వివాహేతర సంబంధాలు ఏమైనా కారణమా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగుతోంది. ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం



ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం రోడ్డులో ఉన్న శ్మశాన వాటికలో షికారి విజయ్ అనే వ్యక్తి వద్ద నుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి ఎక్కడ నుంచి వచ్చిందనే అంశంపై విచారణ చేస్తున్నామన్నారు. అదే విధంగా ఆత్మకూరు మండలం గొరిదిండ్ల తండాలో ఇద్దరు వ్యక్తుల నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

శ్రీనివాస్ చౌదరి ఆశయసాధనకు కృషి



శ్రీనివాస్ చౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కామ్రేడ్ శ్రీనివాస్ చౌదరి 40వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయ స్వామి మాట్లాడుతూ.. జిల్లాలో ఈవ్‌టీజింగ్–ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన శ్రీనివాస్ చౌదరి ఆశయాలను కొనసాగిస్తామన్నారు. జిల్లాలో విద్యార్థినులు స్వేచ్ఛగా చదువుకుంటున్నారంటే అది ఆయన పోరాట ఫలితమే అన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఏఐఎస్‌ఎఫ్ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి, ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సహాయ కార్యదర్శి చందు, నగర అధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి నాని, నాయకులు సమీర్‌తేజ్, సాయిపవన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో వసంత పంచమి



అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం వసంత పంచమి వేడుకలను ఏజీఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాఘమాసంలో వచ్చే పంచమి రోజున సరస్వతి జన్మదినమని బ్రహ్మ పురాణం ప్రకారం చదువుల తల్లి సరస్వతీ దేవి ఆ రోజునే జన్మించిందన్నారు. పిల్లలందరికీ అక్షరాభ్యాసం తచేసినట్లయితే మంచి ఉన్నత విద్యావంతులు నమ్మకం చాలా మంది తల్లిదండ్రుల్లో ఉందన్నారు. అనంతరం ఏజీఎం సుబ్బారెడ్డి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబసూం, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఇర్షాద్, ఏఓ గోపాల్, డీన్‌లు సిరాజుద్దీన్, అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న ఆపస్ కార్యవర్గ సభ్యులు

అనంతపురం కార్పొరేషన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, అనంతపురం జిల్లా శాఖ జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి పేర్కొన్నారు. ఆదివారం కోర్టులోని ఆపస్ కార్యాలయంలో ఆపస్ ఆవిర్భావ దినోత్సవం, వసంత పంచమి, అహల్యభాయ్ హోల్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపస్‌ను 1982లో ప్రారంభించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి రాజీలేని పోరాటాలు చేశామన్నారు. భవిష్యత్తులోనూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర గౌరవ సలహాదారులు వెంకటేశ్వర ప్రసాద్, కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, భాస్కరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్‌పీ నాయుడు, జిల్లా కార్యదర్శులు ఆదిశేషు, రమేష్, ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు, ప్రతి నెలా మహిళలకు రూ.1,500, యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అంటూ సూపర్ సిక్స్ హామీలు గుప్పించారు. టీడీపీ, కూటమి నేతలు, సీఎం కుర్చీనెక్కిన చంద్రబాబు నాయుడు తూతూమంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి ప్రకటించగా.. ఇంకో అమాత్యుడు నారా లోకేష్ రోడ్ మ్యాప్ వేద్దాం.. వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామని చెబుతున్నారు. హామీలు చూస్తుంటే భయమేస్తుందని ఏకంగా సీఎం చంద్రబాబు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా? అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తరా?

- ఎన్నికల హామీ అమలు చేయకపోవడంపై మహిళల అసహనం
- అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటినా అతీగతీ లేదంటూ విమర్శలు
- ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు

రాప్తాడు: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోల్లో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణం చేయొచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి 7 నెలలు గడుస్తున్నా హామీలను పట్టించుకోవడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇంకెప్పుడు అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి. తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచో అమలులో ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అదే ఫార్ములాను అమలు చేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఉచిత బస్సు హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే హామీ..

రాప్తాడు నియోజకవర్గంలో దాదాపు 3 లక్షల మందికి పైగా జనాభా ఉన్నారు. అందులో 18 ఏళ్లు పైబడిన మహిళలు 1,25,810 మంది ఉన్నారు. ఆత్మకూరు మండలంలో 16,747, అనంతపురం రూరల్‌లో 41,387, రాప్తాడులో 17,912, కనగానపల్లిలో 16,798, రామగిరిలో 14,536, చెన్నేకొత్తపల్లి మండలంలో 18,430 మహిళ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. రోజూ సగటున 40 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో మహిళ ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చారు. తీరా గెలిచాకా హామీలను పట్టించుకోవడం మరచిపోయారు.

స్పష్టత లేదు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు కనీసం స్పష్టత ఇవ్వడం లేదు. రోడ్డు రవాణ శాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడం తప్ప.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. తొలుత గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికి తోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాము. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూర్చింది.

హామీ ఇచ్చేటప్పుడు భయం కనిపించదా?



ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణకు సాధ్యమా, అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చుని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుంది అని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు భయం కనిపించ లేదు. టీడీపీకి ఓటు వేసి మహిళలంతా మోసపోయారు. – రోజ, బుక్కచెర్ల, రాప్తాడు మండలం

హామీలన్నీ అమలు చేయాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఎప్పుడూ అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం అమలు చేసింది కదా? ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఈ పద్ధతి బాగా లేదు. హామీలు అమలు చేయకపోతే వెంటనే రాజీనామా చేయాలి –మమత, ఎం.బండమీదపల్లి

ఘనంగా ఒడిబియ్యం సంబరాలు



ఆడ బిడ్డలకు ఒడి బియ్యం పెడుతున్న దృశ్యం

రాప్తాడు: గొందిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ముష్టూరు ఉజ్జినేశ్వర స్వామి ఆడబిడ్డల ఒడిబియ్యం సంబరాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని కందుకూరు ఉజ్జినప్ప స్వామి, బొమ్మెపర్తి తాటిచెర్లప్ప స్వామి, రామినేపల్లి పోతులయ్య, బుక్కరాయసముద్రం గుంతకల్లప్ప, అయ్యవారిపల్లి గోటుకూరప్ప స్వామి, గుట్టకిందపల్లి లక్కవమ్మ స్వామి, గొందిరెడ్డిపల్లి ఏకమదప్ప స్వాములను తీసుకొచ్చారు. ఉదయం బుల్లే, జోగి, బన్నీల, జంపాల, మాలగొండ్ల, ముష్టూరు రెడ్లు వంశస్థుల ఆడ బిడ్డలకు స్వామి కాపులు అందరూ ఒడి బియ్యం పెట్టారు. ఆడ బిడ్డలు అందరూ ఒడి బియ్యం కట్టుకుని ముష్టూరు ఉజ్జినేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకుని వారి గ్రామాలకు తరలివెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

జంతువులను హింసించడం నేరం



ఇస్కాన్ గోశాలలో పశువులకు టీకాలు వేస్తున్న పశుశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: జంతు సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ వై.రమేష్ రెడ్డి తెలిపారు. అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆదేశాల మేరకు వసంత పంచమిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఇస్కాన్ గోశాలలో జీవజంతు కళ్యాణ్ దివస్ నిర్వహించారు. జంతువులను సంరక్షించడం, వాటి ఆకలి, దప్పిక, భయం, బాధ నుంచి వాటిని విముక్తి చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. జంతువులను హింసించడం, బాధ పెట్టడం, భయపెట్టడం, అక్రమంగా రవాణా చేయడం, తలకిందులుగా వేలాడదీసి రవాణా చేయడం నేరమన్నారు. అధిక బరువులను మోపడం, తక్కువ స్థలాల్లో ఇరికించడం లాంటివి చేస్తే నిబంధనల ప్రకారం శిక్ష తప్పదని తెలిపారు. ఇస్కాన్ గోశాలలో ఉన్న పశువులకు టీకాలు వేశారు. దాణా, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోశాల సంరక్షకులు సుదర్శన్ పద్మనాభ దాస్, పశుశాఖ ఏడీ డాక్టర్ జి.పద్మనాభం, అనిమల్ రెస్క్యూ టీం వ్యవస్థాపకుడు శ్రీధర్, పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

అనంతపురం కల్చరల్: నగర శివారులోని అంబా భవాని దేవాలయంలో గత మూడు రోజులుగా సాగుతున్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీచక్రం, శివలింగం, నందీశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి సమేత నాగదేవతల స్థిరప్రతిష్టలతో పాటూ శాంతి హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తెల్లవారుజామున నుంచే స్వకుళశాలి సమాజం వారి నేతృత్వంలో భవానీ మాతకు కుంకుమార్చనలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సరోదె రాజేంద్రప్రసాద్, సెక్రటరీ జుజారె మురళీకృష్ణ, ట్రెజరర్ ప్రభాకరరావు, ధర్మకర్త వెంకట సురేష్‌బాబు, మహిళా విభాగం గీతాంజలి, శాంతకుమారి, లలితాబాయి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

జమ్మలమడుగు: జమ్మలమడుగులోని కెనరా బ్యాంకులో ఐదు రోజుల క్రితం పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి సావిత్రి అనే మహిళకు సంబంధించిన బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ పుటేజీల ఆధారంతో దొంగలను పట్టుకున్నారన్నారు. నిందితులు అనంతపురం జిల్లా మారుతీ నగర్, గుత్తి టౌన్‌కు చెందిన వనార్పి అనంతమ్మ, ఆమె కుమారుడు మహేష్, కోడలు గాయత్రిగా గుర్తించామన్నారు. ఆదివారం తాడిపత్రి బైపాస్ రోడ్డులో ఓమినీ కారులో పారిపోతుండగా సీఐ లింగప్ప, ఎస్‌ఐ బి.రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, రియాజ్, నాగేంద్ర చాకచక్యంగా వారిని పట్టుకున్నారని తెలిపారు. వారి నుంచి 11 తులాల బంగారంతో పాటు ఓమినీ కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో అర్బన్ సీఐ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తాం

అనంతపురం కల్చరల్: అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా సందడిగా జరిగిన 7వ అనంత లఘుచిత్రోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. వందలాది మంది కళాకారులతో కళాప్రాంగణం కళకళలాడింది. నగరంలోని అనంత కన్వెన్షన్ హాలులో ఉదయం నుంచి రాత్రి వరకు చిత్రోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఫిల్మ్ మేకర్, డైరెక్టర్ రషీద్‌బాషా నేతృత్వంలో సినీ, టీవీ పరిశ్రమలకు చెందిన హైదరాబాద్ నుంచి విచ్చేసిన సినీ సాంకేతిక నిపుణులు, బుల్లితెర నటీనటులు, సామాజిక సేవా కార్యకర్తలు మాట్లాడారు. ఉత్తమ లఘుచిత్రాలు, 18 విభాగాల్లో నైపుణ్యం ప్రదర్శించిన సమర్పకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు అవార్డులు అందజేసినట్లు తెలిపారు. స్క్రిప్ట్ రైటింగ్‌లో బెస్ట్ రైటప్‌గా నిలిచిన దానిని రూ.50 వేలు బడ్జెట్‌తో సందేశాత్మక లఘుచిత్రం నిర్మించామన్నారు. ఎంతో మంది ఔత్సాహిక కళాకారులకు అవకాశాలు రావడం లేదని అటువంటి వారిని ప్రోత్సహించడానికే పెద్ద నగరాలతో పాటూ అనంత వంటి చోట్ల లఘుచిత్రోత్సవం జరుగుతుండటం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా కళాకారుడు, ప్రముఖ చిత్రకారుడు కుంచె తిప్పేస్వామి నటించి సమర్పిస్తున్న 'రథసారథి' చిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ సభ్యులు తోట బాలన్న, టీవీ సినీనటుడు రమేష్, సామాజిక సేవా కార్యకర్త ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి, కవులు నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న లఘుచిత్ర దర్శకులు

'నయవంచనకు మారుపేరు చంద్రబాబు'

అనంతపురం కార్పొరేషన్: నయవంచనకు మారుపేరు సీఎం చంద్రబాబు. ఎన్నికలకు ముందు జాబ్ క్యాలెండర్, డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను వంచించారు. యువతకు ఉద్యోగాలు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతాం' అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం గుత్తి రోడ్డులోని కనకదాస కళ్యాణ మంటపంలో యువజన విభాగం నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న లోకేష్ చెప్పిన వీడియోలను చూపించారు. 2014–19, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో మంత్రిగా లోకేష్ ఉన్నారని గుర్తు చేశారు. అప్పుడు, ఇప్పుడు యువతకు అండగా ఉంటామని చెప్పి దగా చేశారన్నారు. ఏటా జనవరి 1న జ్యాబ్ క్యాలెండర్ ఇస్తాం.. డేట్, టైం రాసుకోండి.. పారిపోయే బ్యాచ్ కాదంటూ ప్రగ్భలాలు పలికారని మండిపడ్డారు. గతేడాది జూన్ 1న చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసి 7 నెలల 20 రోజులు గడుస్తున్నా.. డీఎస్సీ పోస్టుల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. యువతకు అన్యాయం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్క నోటిఫికేషన్‌తో 1.25 లక్షల శాశ్వత ఉద్యోగాలు భర్తీ చేశారని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు ఏకంగా 2.31 లక్షల శాశ్వత ఉద్యోగాలు, 44 వేల కాంట్రాక్ట్, 3.73 లక్షల ఔట్‌సోర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఐదేళ్లలో 23 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు 34,108 పోస్టులను మాత్రమే భర్తీ చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 6100 డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే.. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో రద్దు చేసిందన్నారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేయకపోతే ఆందోళన చేపడుతామన్నారు. సమావేశంలో యువజన విభాగం అనంతపుం, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులు శ్రీనివాస్ దత్తా, అబ్దుల్ బీషీద్, తలారి చరణ్, రవి, యువజన విభాగం నాయకులు లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దుప్పట్ల పంపిణీ

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం వారు ఆదివారం తెల్లవారుజామున, సాయంత్రం వేర్వేరు చోట్ల దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ నిర్మల, పురుషోత్తమ మురళీకృష్ణ, శివరాజ ప్రసాద్, మనోజ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఈఎఫ్ నూతన కమిటీ ఎంపిక

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లాలో రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌ను బలోపేతం చేయాలని ఆ ఫెడరేషన్ అధ్యక్షుడు పోతుల నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక కార్యలయంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా కన్వీనర్‌గా టి.రాజారమేష్, రాష్ట్ర కో–కన్వీనర్‌గా శ్రీనివాసులు, మద్రిస్వామి, మావిటి శ్రీరాములు, రాయలసీమ కో–కన్వీనర్‌గా వరదరాజులు, జిల్లా కో–కన్వీనర్‌గా స్వరూప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉజ్వల్, ఈశ్వరయ్య, మూర్తి, వాజిద్ బాషా పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: శిల్పారామంలో ఆదివారం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. నృత్య గురువు సంధ్యామూర్తి శిష్య బృందం ఆధ్వర్యంలో భరత నాట్యం ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు వినోదాన్ని అందించాలన్న ఉద్దేశంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందించి అభినందించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

అనంతపురం మెడికల్/అనంతపురం సెంట్రల్: స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాలలో ఆదివారం విశాఖపట్టణం కో–ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. బ్యాంకు డైరెక్టర్ పాలెం నారాయణస్వామి మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరాన్ని సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం పొడవునా తమ బ్యాంకు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరానికి 197 మంది రోగులు హాజరయ్యారు. వీరిలో 150 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు బెంగళూరు శంకర్ కంటి వైద్య ఆస్పత్రి కో–ఆర్డినేటర్ శివప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి అసివుద్దీన్, కోశాధికారి ఉమామహేశ్వరి, బ్యాంక్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కాపాడుకుందాం

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చేలా సుప్రీం కోర్టు తీర్పు ఉంది. దళిత, గిరిజనులు ఐక్యతగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కాపాడుకుందామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి అడ్డంకులు సృష్టించి చట్టాన్ని కనుమరుగు చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. చట్టాన్ని కాపాడుకునేందుకు ఎవరు అడ్డు వచ్చినా ఎదురిస్తామన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, సాకే చిరంజీవి, ప్రకాష్, మల్లికార్జున నాయక్, బాల పెద్దన్న, కేపీరాజు, వేమన్న, సాకే శ్రీహరిమూర్తి, వినయ్, నరేష్‌కోడవండ్ల, వన్నూరు స్వామి, ఉమామహేశ్వరి, మూర్తి, రాజా రమేష్ పాల్గొన్నారు.

రేపు 'సామూహిక సూర్యనమస్కార యజ్ఞం'

అనంతపురం కల్చరల్: రథసప్తమి పర్వదినం సందర్భంగా వివేకానంద యోగా కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 6 గంటలకు సామూహిక సూర్యనమస్కార యజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో 108 సూర్యనమస్కారాలు చేయడం జరుగుతుందన్నారు.

ఆయకట్టుకు సాగునీరు అందించాలి

రాప్తాడు: హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు ఆపి, వెంటనే ఆయకట్టుకు నీరు అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 4వ తేదీన అనంతపురంలో హంద్రీ–నీవా కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. హంద్రీ–నీవాను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి 10 వేల క్యూసెక్కుల నీటిని అందించాలన్నారు. ధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర సభ్యుడు జగదీష్ తదితరులు హాజరవుతారన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

సందర్భం: నేడు వసంత పంచమి

అనంతపురం కల్చరల్: శివకేశవులకు ప్రీతికరమైన పవిత్ర మాఘమాసంలో ప్రతిదినం విశిష్టమైనదే అయినా పవిత్ర మాఘంలో వచ్చే శుద్ధ పంచమికి విశేష ప్రాముఖ్యత ఉంది. అక్షరాభ్యాసానికి శుభ సూచకంగా భావించే వసంత పంచమి వేడుకలు సోమవారం జిల్లా అంతటా ఘనంగా జరుగనున్నాయి. లక్ష్మీ, సరస్వతీ సముద్భవించిన రోజుగా వసంత పంచమిని చెప్పుకోవచ్చు. అక్షరాభ్యాసానికి తొలిమెట్టుగా శ్రీకారం చుట్టుకునే దినంగా ప్రసిద్ధి చెందింది. అందువల్లే ప్రత్యేక రోజుల్లో కన్నా శ్రీపంచమిగా పిలువబడే వసంత పంచమి నాడు అమ్మవారి ఆలయాల్లో పెద్ద ఎత్తున చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు. నగరంలోని అనేక ఆలయాల్లో వసంతి పంచమి వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు.

'అనంత'లో చదువుల తల్లి

చదువుల తల్లిగా అందరూ భావించే సరస్వతీ మాత ప్రతిరూపమైన శారదా అమ్మవారు మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం ఏర్పడిన కొన్ని దశాబ్దాల తర్వాత శారదా మాత ఆలయం నిర్మాణమైంది. అమ్మవారితో పాటూ ఇక్కడ ఆది శంకర భగవత్పాదులు, సంగీత స్రష్ట త్యాగరాజ స్వామిని కొలువుదీర్చారు. ప్రతి మాఘమాసంలో అక్షరాభ్యాసాలకు వేదికగా నిలిచే శ్రీపంచమి పర్వదినాన్ని వేడుకగా నిర్వహిస్తారు. అలాగే నగర శివారులోని శారదా శృంగేరీ శంకర మఠంలో శారదా మాత ఆలయం చదువుల తల్లిగా ప్రఖ్యాతి చెందింది. చదువుల తల్లి శారదా మాత జన్మదినం సందర్భంగా సోమవారం రెండు ఆలయాల్లో పెద్ద ఎత్తున సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తెల్లవారుజామున నుంచే అమ్మవారికి ప్రత్యేక అలంకార సేవలు, అక్షరాభ్యాసాలు జరుగుతాయని పేర్కొన్నారు.



శృంగేరి మఠంలో కొలువుదీరిన శారదా మాత

నేటి నుంచి మాఘమాస పూజలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మాఘ మాసం సందర్భంగా ప్రతి సోమవారం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, మంజునాథునికి విశేష పూజలు, 9న శ్రీమహా గణపతి హోమం, 12న మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని విశేష అభిషేకాలు, 16న త్రిచవిధ సూర్యనమస్కారాలు, అరుణ హోమం, 26న మహాశివరాత్రి ఉత్సవముతో పాటు రుద్రాభిషేకాలు ఉంటాయన్నారు.

పోటెత్తిన భక్తులు

పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మాఘ మాసంలో వచ్చిన మొదటి ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉప ఆలయాల్లోని మంజునాథస్వామి, పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.